అడవి మల్లెలు

శ్రీ జె. సత్యనారాయణ

గుబురుగా పెరిగిన జొన్న చేలోనుంచి చలిగాలి ఈడ్చి కొడుతున్నది. జొన్నకర్రలు గాలికి వంగినప్పుడల్లా ఆకులు రాసుకుని చప్పుడు చేస్తున్నాయి.

మంచెక్రింద, నగిడి ఆరిపోతే నోటితో వూది మంటచేశాడు రాజాలు. నిద్రకి ఆగలేక, ఒక జోగు జోగి నగిడిలో పడేవాడల్లా ఉలిక్కిపడి మేలుకొన్నాడు లక్ష్మడు.

"అదిగో - నగిడిలో పడుదువా? అప్పుడే ఏం నిద్ర? అట్లాగల్లి నాలుగు చితుకులు ఏరుకురా. పెద్ద మంటేద్దాం!" లక్ష్మడి భుజం చరిచి లేపాడు అప్పిరెడ్డి. లక్ష్మడు వళ్ళు విరుచుకుంటూ బద్దకంగా లేచి బయటకు వెళ్లి నాలుగు వెదురు బద్దలు, చిన్న చిన్న చెక్కపేళ్లు ఏరుకొచ్చి, నగిడి దగ్గర పడేసి, కొంకర్లు తిరిగే వేళ్ళను కాపుకున్నాడు.

"యింతమాత్రం చలికె వణికిపోతే యికను వేఁం పనికొస్తావు—చచ్చుదద్దమ్మవు!" మృదువుగా లక్ష్మడి మెడమీద చిన్న దెబ్బ కొట్లాడు అప్పిరెడ్డి.

"లేదు సామీఁ! ఈయాల మాలావు చలేస్తుంది దొర! అసలు ఈ నగిడి లేకపోతే చానా కట్టం అనుకోండి ఈ దేశాన!" బద్ధకంగా వళ్లు విరుచుకున్నాడు లక్ష్మడు.

"హారి నీ!" అంటూ నవ్వుకున్నాడు అప్పిరెడ్డి. నగిడిలో పేళ్లు, వెదురు బద్దలు, వేసి మంట పెద్దది చేశాడు. ఆ నగిడి వెలుగు చుట్టుప్రక్కల చాలా వరకు అలుముకు పోయింది.

చుట్టు అడవి కీరు మంటూంది. ఏభై అరవై గజాల దూరంలో పొలం చుట్టువున్న 'తోగు'లోనుంచి నీరు పారుతూ చప్పుడు చేస్తూంది. తోగు (వాగు) డొంకల్లో నుంచి రకరకాల అడవి పూలవాసన జిమ్ముతున్నది. వాగు పొడుగునావున్న కన్నాల్లోనుంచి బయటకులాగి, కడుపునిండా తిన్న ఎండ్రపీతలు అరక్కేమో, నక్కలు ఊరికే అరుస్తూన్నాయి.

ఆతోగు పొడుగూతా సుమారు పాతికెకరాల పొలం సంపాదించాడు అప్పిరెడ్డి. "యింత చేస్తే ఆపాడు అడవిలో ఎందు కొచ్చింది! ఏం పూసుకు తిందామని" అన్నారు అప్పిరెడ్డి బంధువర్గం మొదట్లో.

"మీకేం తెలుసు! తలుచుకుంటే బంగారం పండిస్తాను!"—అనుకున్నాడు అప్పిరెడ్డి.

అనుకున్నట్టే చేశాడు చివరకు.

మొదట్లో అక్కడున్న పొదలు, గడ్డి దుబ్బులు వాట్ని తీయించి మొదలుపెట్టాడు వ్యవసాయం. అయిదారు ఏళ్లకి, అడవికోళ్ళు దుప్పులు ఎలుగుబంట్లు తిరిగే ఆ ప్రదేశాన్ని మిరపతోట, పొగతోట యిత్యాదులు వేసి కొత్తజీవం పోశాడు. అప్పిరెడ్డికి అంతయిదిగా కలసిరావడానికి, ఆ పొలంలో బంగారం పండటానికి ముఖ్యంగా, పొలం ప్రక్కనుంచే పారే ఆవాగే కారణం అంటూంటారు. ఎందుకంటే ఎండాకాలం కూడా ఆ తోగు ఎండిపోదు. అన్ని కాలాల్లోనూ కావలసినంత నీరు యిస్తూంటుంది. తను పైకి రావడానికి కారణం మరొటి కూడా వుందని నమ్ముతూంటాడు అప్పిరెడ్డి. ఏవీఁటంటే, ఆ పొలంలో ఏరువాక సాగే మొదటిరోజున నాగలి కర్రుకి ఏదో రాయిలాంటిది తగిలి, కర్రు మొక్కపోయింది. ఏదో రాయి అనుకుని గునపాలు తెచ్చి త్రవ్వేసరికి ఏవో రెండుమూడు విగ్రహాలు బయటపడ్డాయి.

"పొలంలో ఏవో దేవతలు వెలిశారు. వస్తే పైకొస్తాడు...లేకపోతే నాశనమన్నా అవుతాడు...!" అనుకున్నారు ఊరంతా. అయితే అప్పిరెడ్డి పైకే వచ్చాడు. ఆ విగ్రహాల్ని పొలానికి సమీపంలోనే ఒక చెట్టుక్రింద ప్రతిష్ఠించి, చిన్న గుడి కట్టించి ఏటా పెద్ద ఎత్తున సంబరాలు చేయిస్తూంటాడు.

నగిడి మంట మరీ పెద్దదికావడం వల్ల కాస్త వెనక్కి జరిగి కూర్చున్నారు ముగ్గురూ.

"సెల పొడుస్తూన్నట్టుంది దొర...! గుట్టపై ఆకాశంలో అంతా ఎలుగు నిండిపోయింది." అంటూ అటువైపుకి చెయ్యి పెట్టి చూపించాడు రాజాలు.

అప్పిరెడ్డి, లక్ష్మడు యిద్దరూ కొన్ని క్షణాలవరకు అటువైపు చూచారు.

"పూర్తిగా పొడవనియ్ ...! ఆ మోదుగుచెట్టు పైకెక్కేగాని, మనకి గుట్టప్రక్కన వెన్నెల పడదు... అయినా యిప్పుడింటికెళ్ళి చేసే పనేముంది. పోయి పడుకోవటమేగా ...!" అంటూ జేబులో నుంచి రెండు పుగాకు పాయలుతీసి పెద్ద చుట్టచుట్టి నగిడిలో నుంచి చిన్న కొరకంచు తీసి నోటిదగ్గరగా పెట్టి ముట్టించాడు అప్పిరెడ్డి.

"ఏదీ...! యివ్వాళ 'మాటు' కడతామన్నారు. పోలేదేం రా...!" అన్నాడు రాజాలు నుద్దేశించి ఈలోపులో చెయ్యిచాపిన లక్ష్మడి వళ్ళోకి రెండు పుగాకు పాయలు విసిరాడు.

"లే ద్దొర! పెద్ద తూటాలకోసం సింహాద్రి గారు సుబ్బరాజుగార్ని పంపారు కదండి ... యింకా రాలే...మనదగ్గరున్నయి పిట్టల్ని కొట్టేవి. పులిని కొడతానికి పనికి రావంట...!" అన్నాడు రాజాలు వేటంటే తనకున్న ఉత్సాహాన్నంతనీ ముఖంలో వ్యక్తం చేస్తూ.

"ఏదెలాగున్నా చాలా జాగ్రత్తగా వుండాలి! మనిషి నెత్తురు మరిగిన పుల్ని కొట్టటమంటే మాటలు కాదు. మొన్న ఎవతెనో, అడవిలోకి పుల్ల లేరుకుంటానికి వెళితే మీదపడి లాక్కుపోయిందటగా...!" అన్నాడు అప్పిరెడ్డి.

"అవునండి — పాపం మన శాయన్నగాడి తల్లండి శానా ముసిల్ది...!"

"పాపం...!" అన్నాడు అప్పిరెడ్డి. చుట్ట పొగను గుప్పుగుప్పున వదలుతూ, ఆ మైకంలో ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు.

"యింకెంతండి — సుబ్బరాజుగారు రేపు తూటాలూ తెస్తే దాని రోజు మూడిందన్నమాటే... మన సింహాద్రిగారు తలుచుకుంటే ఎంతసేపు ... దీని తల తన్నిన పులుల్ని కొట్టలేదూ...?" అన్నాడు లక్ష్మడు.

అప్పటికి నెల కొండ దాటి బయట కొచ్చింది. నిటారుగా ఆకాశంలోకి చొచ్చుకుపోయిన టేకుచెట్ల ఆకుల సందులోనుంచి చంద్రుడు మెరుస్తున్నాడు. మసకమసగ్గా వెన్నెల పడుతోంది.

అప్పిరెడ్డి యింటికి పోయే ఉద్దేశ్యంతో లేచి నిలబడ్డాడు.

"యింటికా దొర?" అన్నాడు లక్ష్మడు.

"ఆఁ..పోతా! నెల చాలా దూరం ఎక్కినట్లుంది. యింకెందుకు? మీరు మాత్రం పొలందగ్గర జాగ్రత్త! తోట మంచికాపులో వుంది. పందులు గిందులు వస్తయ్! చూస్తుండండి." అన్నాడు అప్పిరెడ్డి చెప్పులో కాళ్ళు పెడుతూ. రాజాలు మంచెయెక్కి అక్కడ పెట్టిన శాలువా తెచ్చి అప్పిరెడ్డి కిచ్చాడు. అప్పిరెడ్డి శాలువా వంటినిండా కప్పుకుని, మఫ్లర్ చెవులకి బిగుతుగా చుట్టాడు.

"మరింక నే పోతున్నా జాగ్రత్త!" అంటూ మంచెగుంజకు జేర వేసిన చేతికర్ర తీసుకొని బయలు దేరాడు.

"చానా పొద్దోయినట్టుంది! నేనుకూడా రానా దొర అక్కడనాక! ఆ గుట్టకాడ చిరుతపులోటి తిరుగుతుందంట!" అన్నాడు లక్ష్మడు తను కూడా బయలు దేరటానికి సిద్ధమవుతూ.

అప్పిరెడ్డి నవ్వాడు. "హోరి నీ—పాతికేళ్ళనుంచి నలుగుతుందీ దారి. చిడతపులి గిడతపులి - అది నన్నేం చేస్తది రా!" అంటూ ముందుకుసాగాడు అప్పిరెడ్డి. కంకివేసి అప్పుడప్పుడే పాలుపోసుకుంటూన్న జొన్నచేలు, పంటకొచ్చిన మిరపతోట దాటి అడవి దారిలో పడ్డాడు.

బాగా నలిగిన బండిబాట అవడంవల్ల దారి చాలా వెడల్పుగా వుంది. అటూ యిటూ పొదలు. దూరదూరంగా ఆకాశాన్నందుకుంటూన్న టేకు చెట్లతో అడవి కేరుమంటూంది. దారిపొడుగునా చెట్లు అడ్డురావడంవల్ల వెన్నెల జాడజాడలుగా పడుతోంది. పొదల్లోనుంచి ఏవో కీటకాలు, పిట్టలు వూరికే ధ్వని చేస్తున్నాయి.

పైనుంచి మంచు కురుస్తున్నా వంటినిండా శాలువ వుండటంవల్ల ఏమీ అనిపించడంలేదు. కాళ్ళకు చెప్పులున్నా, బండిబాట బాగానలిగి దుమ్ముతేలి, మంచుకి తడిసి చల్లబడిన దుమ్ము చెప్పుల్లోదూరి కాళ్ళను మొద్దుబారిస్తున్నది. అయితే ఆ దుమ్ము పాతికేళ్ళ నుంచి అప్పిరెడ్డి కాళ్ళక్రింద నలుగుతూనే వుంది అలానే.

చుట్టూ కమ్ముకున్న కొండలు, కేరుమనే అడవుల మధ్య తెల్ల బట్టల్ని చూస్తే జెడిరి ఆమడదూరం పారి

పోయి, తేరి పార చూచే అమాయకులైన మనుష్యుల మధ్య "సుట్టు గుడిశ"ల మధ్య వెలసిన తన పెంకుటింట్లో కిటికీకి ఎదురుగా, దుప్పిత్తోలు కప్పిన తన పడక కుర్చీలో నడుంవాల్చి, ఎదురుగా కనిపించే కొండల్ని, నిటారుగా పెరిగిన టేకు చెట్లను చూస్తూ అప్పుడప్పుడు అనుకుంటుంటాడు అప్పిరెడ్డి — "ఎక్కడి నెల్లూరు? ఎక్కడి వ్యవహారం?" అని.

మొదట కిరాణా వ్యాపారిగా ఈ ప్రాంతం వలసవచ్చి, రెండు చేతులా సంపాదించాడు. రానురాను భూమికొని పెద్దఎత్తున వ్యవసాయం చేసి మోతుబరి రైతుగా చెలామణి అవుతూన్నాడు అప్పిరెడ్డి.

ఎందు కిదంతా? ఎందుకు సంపాదించాడు! ఎవరికోసం? తన స్వంతం అని చెప్పుకుందుకు ఎవరున్నారు? బంధువర్గమ్మీద ఎక్కువ నమ్మకం లేనివాడు అప్పిరెడ్డి. భార్య చనిపోయి పాతికేళ్ళు దాటిపోయింది. రొఖం ఆస్తి చూచి పిల్ల నివ్వడానికి చాలామంది వచ్చినా ఎంచేతనో మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు.

"నీతరం తరువాత యిదంతా ఏంచేస్తావయ్యా? బిడ్డా పాపా కూడ లేదుకదా? "అని అంటే, "నేను ఎక్కడయితే పైకి వచ్చానో, ఎవరివల్ల వచ్చానో అక్కడే, వాళ్ళకోసమే ఖర్చువ్వాలి తన సంపాదనంతా...బయటకి పోడానికి వీలులే—"అంటూంటాడు అప్పిరెడ్డి. నిజంగా అప్పిరెడ్డిచేసే పనికూడా అదే.

బస్తీలంటె ముఖం మొత్తింది అప్పిరెడ్డికి. ఎప్పుడైనా తన స్వస్థలం వెళ్ళినా రెండు మూడు రోజుల కంటే ఎక్కువ వుండేవాడు కాడు. మళ్ళీ నీలికొండలు, పచ్చటి అడవులు, రకరకాల జంతువుల పిట్టలకూతలు, కొండలోయల్లో నుంచి పారే చల్లటి తోగు నీరు - యివి లేకపోతే ఏమిటో వెలితిగా వుండేది. ఇక్కడి మనుష్యులు, ఇక్కడి వాతావరణం తోటి బాగా కలసిపోయాడు అప్పిరెడ్డి.

పరధ్యానంగా ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాడు అప్పిరెడ్డి...

మధ్యదారిలో, బండి బాటకు ప్రక్కనుంచే రెండు ఫర్లాంగులకుపైగా వ్యాపించిన చిన్నగుట్టను చుట్టి మలుపు తిరగాల్సివుంటుంది. అక్కడకు రాగానే ఎవరైనా కొస్త జంకుతారు. గుట్ట అంతా దట్టంగా చెట్లు, పొదలు, గడ్డి దుబ్బులు, రాళ్ల కుప్పలతో నిండి వుంటుంది. రాత్రులు చూట్టానికి చాలా గంభీరంగా వుంటుం దా గుట్ట. గుట్ట నీడ అడ్డు రావడంవల్ల, దారంతా మసక మసగ్గా వుంది. సహజంగా అంత ప్రొద్దుపోయి ఆ గుట్టప్రక్కనుంచి రావడానికి ఎవరూ సాహసించరు. అప్పిరెడ్డి నడకలో వేగం హెచ్చించాడు. ఇంతలోనే ప్రక్కపొదలో నుంచి ఏదో 'చంగ్'మని దూకిన చప్పుడై, ఏదో ఆకారం దారికడ్డంగా, సుమారు ఏభై, అరవై గజాల దూరంలో నిలబడ్డది! అప్పిరెడ్డి ఉలికిపడి 'టక్కు'న ఆగిపోయాడు. శరీరంలోనుంచి వెచ్చటి పొగలు బయలుదేరినట్లయింది. అక్కడే నిలబడి దానికేసి తేరిపార చూచాడు. అనుమానం పోయినమీదట ఒక బెడ్డ ముక్క ఏరి దాని ముందుకు విసిరాడు. అది బెదరి మళ్ళీ పొదలోకి పారిపోయింది. "ఓస్—! నక్కపోతు...! దొంగముండ నన్నే భయపెట్టిందే...!" అనుకొని తనలో తానే నవ్వుకున్నాడు అప్పిరెడ్డి.

ఎందుకయినా మంచిదని నడకవేగం మరికొస్త హెచ్చించాడు. ఆ గుట్టదాటి మలుపు తిరిగితే యిక అంతా బయలుగానే వుంటుంది. పెద్ద అడవి ఏమీ వుండదు; చిన్న చిన్న తుప్పలుతప్ప.

గుట్టదాటి, మలుపు తిరగ్గానే దారంతా వెన్నెల పరచినట్టు కనిపిస్తుంది. దారిపొడుగూవావున్న అడవి మల్లెపొదలు- యింకా ఏవో రకరకాల అడవిపూల వాసన 'ఘుప్పు'న కొడుతున్నది. ఎండిపోయిన వెలగ చెట్టు కొమ్మలోనుంచి చంద్రుడు పైకెక్కుతున్నాడు. దారంతా బయలు బయలుగా వుంది.

తనకు కొద్దిదూరంలో ఎవరో వస్తూన్నట్టు చప్పుడైతే, తలఎత్తి చూచాడు అప్పిరెడ్డి. వంటినిండా తెల్లటిదుప్పటి కొంబోలు కప్పుకునివుంది; నడుస్తూంటే కాలిఅందెల మోత ఆ నిశ్శబ్దమైన రాత్రిలో స్పష్టంగా వినిపిస్తూంది. ఆశ్చర్యపోయాడు అప్పిరెడ్డి. "ఇంత రాత్రిలో వంటరిగా ఈ దారిన వచ్చే ఆడవారు ఎవరై వుంటారు—?" అనుకున్నాడుగాని ఊహించలేక పోయాడు.

ఆ వచ్చే వ్యక్తి ఎదురుగా వచ్చే అప్పిరెడ్డిని గమనించలేదేమో తలవంచుకుని అలానే వస్తూంది. దగ్గరకు రాగానే చెప్పుల చప్పుడు వినిపించిందేమో, తలెత్తి చూచి యిక ఎటూ కదల్లేక అలాగే నిలబడిపోయింది. అప్పిరెడ్డి దగ్గిరకెళ్లి చూచి నిర్ఘాంతపోయాడు!

"ఎవరది-? నాగులూ...!"

కొంచెం తొట్రుబాటు కలిగి తడబడ్డది.

"ఆఁ...! నేనే బాబాయి...!"

"ఓసి నీ—అసాధ్యం...! యిదేంటి యింత రాత్రిలో ఎక్కడికి అడవిలోబడి పోతున్నావు...?"

"లేదు బాబాయ్...! యివ్వాళ మన ఆవుదూడ యింటికి రాలేదు—చూద్దామని!"

"ఆవుదూడ యింటికి రాలే! తెల్లారి వెతుక్కొ వచ్చుగా. యిప్పుడేం తొందర? నడూ యింటికి పోదాం! యింత అడవిలో యింత రాత్రిలో!"

అంతకన్న యింకా ఏమీ అనలేక పోయాడు అప్పిరెడ్డి. ఇక ఏమీ మాట్లాడలేక వెనక్కు తిరిగింది నాగులు.

"చిన్న దూడ కదూ బాబాయి! అడవిలో గాని చిక్కుపడ్డదంటే దుసపోతు (తోడేలు) గాని ఎత్తుకు పోద్దే మోనని...అయినా ఎన్నిలేగా...ఏం భయం రోజూ తిరిగే దారేగా?"

అప్పిరెడ్డి కొన్ని క్షణాలవరకూ ఏమీ మాట్లాడ లేదు.

"పోతే పోనియ్. బ్రతికుంటే అదే రేపుతల్లితో కలిసొస్తుంది. ఇంత రాత్రిలో యింత అడవిలో ఎక్కడెతుకుదామని...అయినా నీకు భయమెయ్యదే నాగీ? రేపు రాజాలు వెతుక్కొస్తాడుగా! నువ్వెందుకు!"

రాజాలు మాట ఎత్తగానే ఏదో రహస్యం బయటపడి పోయినట్టయి సిగ్గుపడి పోయింది నాగులు. పట్టుపడ్డ దొంగలా మళ్ళీ ఏమీ మాట్లాడలేక పోయింది. "బాబాయికి అనుమానం కలిగిందేమో అప్పుడే యింటి కొచ్చేశాడు" అనుకుంది నాగులు.

నాగులు ముందు నడుస్తూంటే, వెనుక అప్పిరెడ్డి నడుస్తున్నాడు. నడుస్తూనే ఏదో ఆలోచిస్తున్నాడు అప్పిరెడ్డి."ఎంత సాహసం..? రోజూ యింతేగామాలు! యింత రాత్రిలో!" ఇది తలుచుకుని ఆశ్చర్య పోయాడు అప్పిరెడ్డి; నాగులు ఎక్కడకు బయలు దేరిందో అప్పిరెడ్డి గ్రహించాడు.

"దూడ కనిపించలేదు వెతకడాని కొచ్చాను!" యివే మాటలు చాలాసార్లు అప్పిరెడ్డి మస్తిష్కంలో పూరికే తిరగ నారంభించాయి. ఏవో గతస్మృతులు స్మృతి పథంలో మెరుపులా మెరసి అలానే నిలచి పోయి వేధిస్తోంటే అప్పిరెడ్డికి కళ్లు చెమ్మగిల్లాయి.

వాళ్లు నడిచే బండిబాటకు ప్రక్కగా, అడవిలో చిన్న గుట్టమీద ఫర్లాంగుదూరంలో ఫారెస్టు రెస్టు హౌస్ బంగళా వొటుంది. ఎవరో ఆఫీసర్లు కేంపు కొచ్చారేమో లోపల లైటు మినుకు మినుకుమని కని పిస్తూంది. నిశీథినిలో, నిండువెన్నెల్లో మునిగి, నిర్జన ప్రదేశంలో అతి గంభీరంగా కనిపిస్తుం దా బంగళా.

ఆ ప్రాంతంలోకి రాగానే, ఆ బంగళా కంటపడి ఏవో గతస్మృతుల్ని జ్ఞప్తికి తీసుకువచ్చింది. అప్పిరెడ్డి మస్తిష్కం యిరవై సంవత్సరాలు వెనక్కు పరు గెత్తింది. ఏవో దృశ్యాలు తెరలుతెరలుగా కళ్లముందు తిరగనారంభించాయి...

అప్పుడూ యిదే దారిన...యిదే సమయంలో పొలంనుంచి యింటికొస్తూన్నాడు. కటికి చీకటిరాత్రి. వర్షాకాలం. దారంతా బురదగావుంది. దారిపక్కన గడ్డి దుబ్బులు, పొదలు ఏపుగా పెరిగి బాగా దట్టంగా వున్నాయి. వర్షం వచ్చేలాగుంది. దూరంగా ఉరుము తున్నది. మెరిసినప్పుడల్లా ఆకాశంనిండానల్లటిమబ్బులు, ఏనుగులమందలు చెల్లాచెదరై పరుగెత్తుతూన్నట్టు కని పిస్తూన్నాయి. అతివేగంగా యింటికి చేరుకోవాలని నడుస్తూన్నాడు. వర్షంకంటే వేగంగా యింటికి చేరుకో వాలని నడుస్తూన్నాడు. తనకంటే వేగంగా వర్షం తరుముకొస్తూంది. ఆకాశం బీటలువారేలా ఉరుములు నెత్తిమీదుగా పరుగెత్తుతూన్నాయి. కళ్లలోనే మెరు స్తూన్నట్టు వుంది. ఈశాన్యదిక్కునుంచి హోరుమనే గాలి. వర్షం తరుముకు రానేవచ్చింది.

ఎంత నిలద్రొక్కుకున్నా గాలి ముందుకు పడ దోస్తూంది. పొదల్లో దాక్కున్న కుందేళ్లు, నక్కలు చెల్లాచెదురై పరుగెత్తుతున్నాయి. చెవులు చిల్లులు పడేలా ఒక్కటే ధ్వని—ఆ పరిస్థితిలో ఏంచెయ్యాలో ఎవరికీ అర్థంకాదు.

ఎలాగో నిలద్రొక్కుకుని ఈ బంగళాలోకి వచ్చి పడ్డాడు. నిజంగా ఈ బంగళాయే లేకపోతే తను ఆ సమయంలో బ్రతికి బయటపడేవాడే కాడు - అను కున్నాడు అప్పిరెడ్డి. బంగళావరండాలోకి చేరుకోగానే ప్రాణాలు కుదుటపడ్డట్టయింది. బయట కుండపోతగా వర్షం. మెరిసినప్పుడల్లా, ఎత్తయిన బంగళాలో నుంచి అడవంతా అతిభయంకరంగా కనిపిస్తూంది. గుండెల్లోనే ఉరుముతూన్నట్టు వుంది.

మెరిసినప్పుడు తప్పితే వరండా అంతా చీకటిగా వుంది. చుట్టూ వున్న పరదాలు దించి వున్నాయి.

లోపల ఎవరూ వున్నట్టులేదు. ఎప్పుడో సెలవో. రెండు సెల్లకో ఎవరన్నా ఆఫీసర్లు కేంపుకి వస్తే తప్ప మిగతా రోజుల్లో గదులన్నీ తాళాలు వేసి వుంచుతారు. పగలు, ఎవరూ కేంపుకి రానప్పుడు మాత్రం, గొడ్ల కాపరులు వరండాలో తలగుడ్డలు తీసి పరచుకుని కాసేపు పడుకుని పోతూంటారు.

అప్పిగెడ్డి జేబు తడిమి అగ్గిపెట్టి తీసి గీశాడు గాని బాగా తడిసిపోయి వుండటం వల్ల వెలగలేదు. నీళ్ళు కారే చొక్కాను విప్పి, నీళ్ళన్నీ పిండి మళ్ళీ వేసుకున్నాడు. కాని ఈదురుగాలి వణికిస్తున్నది.

బంగళాకి వెనుకవైపు వరండాలో గోడ అడ్డు వుండటంవల్ల అటువైపుకి జల్లు కొట్టడంలేదు. పరదాలు వేసి వున్నాయి. అమూల వెచ్చగా వుండవచ్చునుకుని అటువైపుకి నడచాడు.

అటు, అమూలనుంచి గాజుల చప్పుడు వినిపించేసరికి ఆశ్చర్యపోయి నిలబడి తేరి పార చూచాడు అటువైపుకి. ఎవరో మూలగా ఒదిగి నిలబడివుంది. వంటినిండా పవిట చెంగు కప్పుకుని వుంది.

“ఎవరోపాపం! తనలానే వర్షం దెబ్బతిని వుంటారు!” అనుకున్నాడు చీకటిగా వుండటంవల్ల ఎవరయిందీ గుర్తు తెలియడంలేదు.

“ఎవరది?” అన్నాడు.

వర్షపు హోరువల్ల వినిపించలేదేమో ఆమె, పలుకలేదు. వెనుకవైపుకి చూస్తుండటం వల్ల తన్ను గమనించలేదు కూడా. రెండడుగులు ముందుకు వేసి గట్టిగా పిలచాడు. ఆమె ఉలిక్కిపడి యిటువైపుకి తిరిగింది.

“ఎవరంటే మాట్లాడవేం?”

అంతలోనే బయట మెరసిన పెద్దమెరుపు పరదాల్ని చీల్చుకు లోపలకు రావడంవల్ల ఆకారం స్పష్టంగా కనిపించి గుర్తు పట్టాడు.

“ఓస్ నువ్వా! ‘మువ్వాలు’ పెళ్ళానివి కదూ? మరి మాట్లాడవేం?” ఆమె అప్పిగెడ్డిని గుర్తుపట్టింది.

“నేనే బాబుగారు, మాణిక్యాన్ని! పొదువాన అనుకోకుండా ముంచుకొచ్చింది. అసలే నాకు మెరుపులు ఉరుములంటే భయం...మెరిస్తే కాళ్లు ముందుకు సాగవు-కళ్లు చీకట్లు కమ్ముతాయి. సమయానికి ఈ బంగళా దగ్గరకొచ్చాను. లేకపోతే దారిలోనే చద్దును...” అంటూ కొద్దిగా ముందుకొచ్చింది.

అప్పిగెడ్డి నవ్వాడు.

నిజమే! తనుమాత్రం ఏ మయ్యేవాడు అప్పుడు. ఎన్నాళ్ళనుంచో చూస్తూండేవాడు మాణిక్యాన్ని. జొన్న చొప్ప నెత్తి నెత్తుకుని, కాలిమట్టెలు ఘల్లు మనేలా చెలకదారిన వస్తూంటే. ఆ మోత తన గుండెల్లో మ్రోగేది. నిగ్గుతేలి బుసలుకొట్టే యౌవనం, బిగి బిగిసిన కలువ మొగ్గలా, నీటి చుక్క పడితే జారిపోయేటంత నున్నగా మెరిసే ముఖం చూస్తున్నప్పుడు ఏవో ఆశలు పుట్టుకొచ్చేవి; గెడ్డ పొదమీద పూలతీగ అల్లుకున్నట్టు చిక్కగా హృదయంచుట్టు అల్లుకు నేవి “ఛీ! తప్పు - తన కిటువంటి బుద్ధులు పుడుతూన్నాయే...!” అనుకునేవాడు ఆభావం స్ఫురించి నప్పుడల్లా.

వర్షం యింకా కురుస్తూనే వుంది. బంగళా కప్పు మీద పెద్ద పెద్ద బండలు దొర్లుతూన్నట్టు ఉరుముతోంది. గోడ అడ్డువుండటంవల్ల అక్కడ జల్లు అంతగా రావడంలేదు.

“యింత ప్రొద్దుపోయిందే? ఎక్కడనుంచొస్తున్నావు? మీ అమ్మగారివూరు వెళ్లావా?” అన్నాడు.

“లేదండి! మా ఆడదూడ యింటికి రాలేదు. పొద్దుంటగానే వెతకటానికొచ్చా. పొద్దుపోయింది వెదికేసరికి ... ఆఖరికి దొరకనేలేదు ... ఈ వర్షంలో ఎక్కడుందో ఏమిటో...?”

ఆమె చేతిలో దూడ పలుపు పట్టుకొనివుంది. తను బయటపడే వర్షాన్ని చూస్తూన్నాడు పరధ్యాన్నంగా. ఆమె స్తంభానికి జేరబడివుంది.

అంతలోనే కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరిసి అడవంతా త్రుటికాలంపాటు తెల్లగా వెలిగి చీకటై పోయింది. ఆకాశం పగిలి ముక్కలైనట్టు ఉరిమింది. బంగళా ఆవరణలో అతి సమీపంలోనే టేకు చెట్టు కొమ్మమీద పిడుగుపడి పెళ పెళమని కొమ్మ విరిగి నేల కొరిగింది...! ఆమె, హడిలిపోయిన లేడిపిల్లలా ఎగిరి పడి తన మెడచుట్టూ చేతులు వేసి తనకౌగిల్లో యిరికి సొమ్మసిల్లి పోయింది.

ఈ సంఘటన గుర్తుకు రాగానే అప్పిగెడ్డి వెన్ను మీద ఎవరో చరిచినట్టయి ఉలిక్కిపడి, నడిచేవాడల్లా క్షణంసేపు నిలబడిపోయి, మళ్ళీ నెమ్మదిగా నడక ప్రారంభించాడు...

అప్పుడేం జరిగింది...? తను అమానుషంగా ప్రవర్తించాడా...? తన మానసిక ప్రవృత్తిని, తనలో

రేగిన చంచలనాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడు. ...ఆ కౌగిల్లో ఆమెలోవుండే వెచ్చదనం తన నరనరాల్లోకి ప్రాకిపోయింది. శరీరంలోని ప్రతీ అణువు ఉద్రేకపడింది...ఆ ఉద్రేకం తన్ను పశువును చేసింది...!

చాలా సేపటికిగాని ఆమెకు స్పృహ రాలేదు. రాగానే తనున్న స్థితి గమనించి, వెంటనే కౌగిలివిడచి దూరంగా నిలబడిపోయింది. తప్పుచేసిన వాడిలా భయం, సిగ్గు ఆవరించి, తను ఏమీ మాట్లాడలేక అలానే నిలబడిపోయాడు తలవంచుకొని — ముందు ఏం జరుగుతుందో ఊహించలేకపోతూన్నాడు.

ఆమె ఆపాదమస్తకం వణికిపోతూంది. తెల్లబోయి పిచ్చిపిచ్చిగా చూట్టం మొదలు పెటింది.

"ఏం? యింకా భయం పోలేదూ—? ఏం ఫరవాలేదు...వర్షం తగ్గిపోతుంది...!"

ఆమె చేతులతో ముఖం కప్పుకుని, ముఖం అటు త్రిప్పి వెక్కి వెక్కి ఏడుస్తోంది. అదంతా కలలో జరిగినట్టుంది.

"ఛీ...! వూరుకో—వర్షం తగ్గగానే ఇంటికెళ్ళిపోవచ్చు...నీకేం భయంలేదు!" దగ్గరగా వెళ్ళి ముఖానికి అడ్డుపెట్టుకున్న చేతుల్ని తీసి ఓరడించాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు...!

చేతులు తీసేటప్పుడు వారించనూలేదు...!'

వర్షం వెలవగానే బయటికివచ్చి యింటి దారి పట్టారు. మధ్య దారిలో యిద్దరూ మాట్లాడలేదు. దారిలో వాగుపొంగి, మొలలోతు నీళ్లు ప్రవహిస్తోంటే, ఆమె నడుంచుట్టూ చేతులువేసి వాగు దాటించాడు. దానికీ ఆమె అభ్యంతరం తెలుపలేదు.

పొలిమేర చేరుకున్న తరువాత, ఆమె యిల్లు సమీపించగానే, యింటిలోకిపోయేముందు ఆగి, కనుకొలకుల్లోనిండి చెంపమీదకు కారే నీళ్లతో తనకేసి చూచిన చూపుల్ని తన జీవితంలో ఎన్నడూ మర్చిపోలేడు. వాటిని తన హృదయంలో ఒక ప్రక్క గుప్తంగా దాచుకున్నాడు.

తను పుంతదార్లో నడుస్తూంటే ఎన్నోసార్లు, దారిపక్కన ఉన్న మోదుగు చెట్టుమీదనుంచి పువ్వులు రాలి మీదపడేవి. మీదపడిన పూలను దులుపుకుని చెప్పుకాళ్లతో పిప్పిచేసి పోవడం తనకు గిట్టదు. వీటిమీద ప్రత్యేకమైన అభిమానం. మమకారంతో ఏరుతాడు. మాణిక్యం విషయంలో కూడా అలానే జరుగుతుందనుకున్నాడు.

పదికాలాలపాటు ఆ స్నేహం అలాగే సాగింది. మొదట్లో ఎడమొహంగావున్నా తనంటే పడి చచ్చేది రానురాను. తనెంతో సహాయం చేసేవాడు. ఆర్థికంగా, మరో విధంగా కూడా సహాయపడేగాడు. ఇంచేస్తూన్నా, పక్షవాతంలో కాళ్లు, చేతులుపడి మంచంలో మ్రగ్గిపోయే 'ముచ్చాలు' గాడితో నానా బాధలుపడుతోంటే, వాణ్ణి వదిలేసి శాశ్వతంగా తనతో వుండి పొమ్మంటే ఏమంది మాణిక్యం...? రానన్నప్పుడు తను ఏమాత్రం బాధపడలేదు. మాణిక్యం నిండుతనాన్ని తనెంతగానో మెచ్చుకున్నాడు; ఇప్పుడూ మెచ్చుకుంటూన్నాడు.

తనతో స్నేహమైన రెండో ఏట ఎప్పుడూ కొన్పులేని మాణిక్యానికి కొన్పు వచ్చింది...! ఒకనాటిరాత్రి, తూర్పు దిక్కున, నిండుచంద్రుడు పొడుస్తూండగా ఒక ఆడపిల్లను కన్నది మాణిక్యం...!

దానికంత అందం, సౌకుమార్యం, నిమ్మపండు వంటి చాయ ఎలా వచ్చాయి? దానిలో తన పోలికలు కనిపించేసరికి ఊరంతా అదోరకంగా చెప్పుకున్నారు...! అది లోలోనే అణగిపోయింది.

అందరు అనుకునేలా, 'నాగులు' తన రక్తం పంచుకు పుట్టిందని తనూ విశ్వసించగలడా...? తనకు పూర్తి నమ్మకం వుందా...? ఎందుకుండదు...?

మాణిక్యం అప్పుడప్పుడూ అనే మాటలు తను మర్చిపోలేడు...

"యిది నీ కూతురే...! 'ముచ్చాలు'కి అనుమానమే...అందుకనే దీన్నంటే దగ్గిరకు రానియ్యడు... ముట్టుకోడు...!"

ఆ మాణిక్యం ఎక్కడుందిప్పుడు...? తను ఒకప్పుడు మాణిక్యం ద్వారా గొప్ప అనుభూతులు పొందాడు. అది వుండేటప్పుడు, దాని ముఖం కనిపించేటప్పుడు ఎంతో తృప్తిగా వుండేది. ఎంతోమంది ఆప్తమిత్రుల్ని చూస్తూన్నట్టుండేది...మానసికంగా తను ఎంతో హాయిని అనుభవించేవాడు.

అయితే ఆ మాణిక్యం ఎక్కడుంది...? అంతరిక్షంలో అనంతకోటి నక్షత్రాలలో ఒకటై మినుకు మినుకుమనే కాంతుల్ని తన హృదయం మీదకు ప్రసరిస్తూంటుంది...ఆ కాంతి రేఖల్లో ఏదో హెచ్చరిక, ఒక బాధ్యత గుర్తుకు తెస్తుంటుంది...

ఏమిటది...?

"ముమ్మాటికీ నాగులు తనకూతురే...! తనరక్తం పంచుకు పుట్టిందే. తను విశ్వశించగలడు...తను బ్రతికుండగా దీనికి ఏలోటూ రాకూడదు...తన నీడఎప్పుడు దీనితోటే వుంటుంది...దీనిమీదే పడుతూంటుంది.?"

నడుస్తూ యోచించే అప్పిరెడ్డి హృదయంలో సంక్షోభం, గత చరిత్రలు కళ్ళముందు తిరగడంవల్ల కలిగిన ఉద్రేకం తట్టుకోలేక, బయటకు ఏవో అస్పష్టంగా గొణుగుతూ, తనప్రక్కనే నడిచే నాగులు తలను ఆప్యాయంగా నిమిరాడు...!

అప్రయత్నంగా జరిగిన దానికి నాగులు తెల్ల పోయింది.

"తనంటే 'బాబాయి'కి ఎందు కంతప్రేమ...?" అనుకుంది.

"ఏమో...! ఎందుకో తన కర్థంకాదు...కన్న కూతురులాగే చూచుకుంటాడు...!"

ఇద్దరూ నడిచి ఊరు పొలిమేర దగ్గరకు చేరు కున్నారు. ఊరు చివర నేవున్న నాగులుయిల్లు రాగానే యిద్దరూ నిలబడ్డారు.

"యింక నే నెలతాను బాబాయి...!" అంది తలవంచుకునే.

అప్పిరెడ్డి క్షణం ఆలోచించి, రెండడుగులు ముందుకు వేశాడు.

"యిదిగో...చూడు నాగులు...!" ఏదోచెప్పాలని ప్రయత్నించి ఆగిపోయాడు.

"మళ్లీ అక్కడకుగాని వెళతావా యిప్పుడు..?" అన్నాడు కొన్నిక్షణాలు యోచించినమీదట.

నాగులు తెల్లపోయింది, పట్టుపడ్డ దొంగలా.

"ఛీ! మళ్లీ ఎందుకెళతాను బాబాయి యింత రాత్రిలో...! రేపు అదే వస్తుంది యింటికి...!"

అప్పిరెడ్డి వాత్సల్యపూరితంగా నవ్వాడు.

"నాకంతా తెలుసు నాగీ-నువ్వెక్కడకు బయలు దేరావో నాకు తెలుసు...!"

నాగులు వాడిపోయిన పువ్వులా సిగ్గుతో ముడుచుకు పోయింది. ఏమీ సమాధానంలేకుండా తల వంచుకు నిలబడ్డది. అప్పిరెడ్డి నాగులు దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"యింతరాత్రిలో అడవిలో ఒక్కదానివిబయలు దేరావు కదా...ఎంత ప్రమాదం...? ఏ జంతువన్నా కరిస్తే ఏంచేస్తావు...యింకెప్పుడూ అలావెళ్ళకు—" అని, కొన్నిక్షణాలు ఆగి, "చూడు వాగీ! ఈ ఎండాకాలం మీ యిద్దరికీ పెళ్లిచేద్దా మనుకుంటున్నాను...!—మీ అయ్యకి నేను నచ్చచెబుతాను...అప్పుడు యిక యిలా వంటరిగా అడవిలో పడిపోవాల్సిన అవసరం వుండదు—నీ బాగుకోరి చెబుతున్నా, మళ్లీ ఎప్పుడూ యిలా రాత్రులు అడవిలోపడి వెళ్లకు—ఏం...?"

నాగులు నిర్ఘాంతపోయింది. హృదయంలో ఏదో ఆవేశం పొంగింది. సిగ్గు, భయం తన్మయత్వంతో ఉక్కిరిబిక్కిరై అప్పిరెడ్డి కళ్లలోకి వెర్రిగాచూసింది నాగులు. ఆ వెన్నెల్లో, మిలమిల మెరిసే ముత్యాల్లా చెంపమీదకు జారిన కన్నీళ్ళను తన పైపంచతో అద్దాడు అప్పిరెడ్డి.

"ఛీ...! ఊరుకో...! పిచ్చిపిల్లలా కన్నీళ్లెందుకు...! నువ్వేమీ తప్పుచేస్తున్నావని నేను అనుకోవటంలేదు...! అయితే అడవిలోపడి రాత్రులు వెళితే ప్రమాదం. అందుకనే చెబుతున్నా...యింత ప్రొద్దుపోయి యింకెప్పుడూ వెళ్ళకేం...?" వాత్సల్యంగా తల నిమిరాడు అప్పిరెడ్డి.

నాగులు పులకించింది. 'బాబాయి దేవుడు...! తనంటే ఎందు కంత ప్రేమ...! తన తండ్రి కూడా యింత ప్రేమగా మాట్లాడ్డు...ఎప్పుడూ చీదరించుకుంటాడు...తనంటే ఎందు కింత ప్రేమ...?' అనుకుంది నాగులు.

"సరే......యికపోయి పడుకో......ప్రొద్దుపోయింది...!" అంటూ, నాగులు యింటిలోకి వెళ్లే వరకూ అక్కడే నిలబడి చూచి, బరువుగా నిట్టూర్చి యింటిముఖం పట్టాడు అప్పిరెడ్డి.

చింతచెట్టు గుబురులో చంద్రుడు మెరుస్తున్నాడు. ఆకాశంలోనుంచి అడవికొంగలబార్లు అరుస్తూ ఎగిరిపోతున్నాయి.

"పిచ్చిపిల్ల...! అదంటే తన కెందుకంతప్రేమో అర్థంకాదు—నిజంగా, అది తన రక్తం పంచుకు పుట్టిందని తెలిస్తే తనమీదవుండే గౌరవం తగ్గిపోతుందా—? ఏమో! అందుకేక్షతనా విషయం చెప్పలేకపోతున్నాడు...! చెప్పడు కూడా...!"

అప్పిరెడ్డి యోచిస్తూ యింటిదారి పట్టాడు.

*   *   *   *

పలుచని నీలితెరలా వూరుచుట్టూ క్రమ్ముకున్న పొగమంచును సూర్యకిరణాలు చీల్చుకురాగానే,

భూదేవి ఒడిలో నిద్రపోతూన్న ప్రకృతంతా మేల్కొంది. చెరువుగట్టుమీది తుమ్మచెట్లు రంగు దిద్దుకున్నాయి. తంగేడు పొదలచుట్టూ రాలిన తంగేడు పూలు ఎండకు వజ్రపుతునకల్లా మెరుస్తూన్నాయి. ముద్దుకొన్న లేతకిరణాల తాకిడికి తామరమొగ్గలు మేల్కొని అరవిచ్చుకున్నాయి.

బారెడు ప్రొద్దెక్కగానే ఎడ్లను కడగటానికని అప్పిరెడ్డి యింటికి వచ్చాడు రాజాలు. గుమ్మం ఎక్కగానే, వాలుకుర్చీలో కూర్చుని తుపాకును తుడుస్తూన్నాడు సింహాద్రి. తూటాలు లెక్కపెడుతూ సుబ్బరాజు ప్రక్కనే కూర్చున్నాడు.

"తూటాలు వచ్చినియ్యిరా...! ఈ రాత్రికే 'మాటు' లోకి వెళ్లటం...తయారుగా వుండు—" అన్నాడు సింహాద్రి.

తూటాలను చూడగానే ఎక్కడలేని ఉత్సాహము వచ్చిపడ్డది. దగ్గరలోనే అరుగుమీద పేము కుర్చీలో పడుకుని చుట్టకాలుస్తూ మైకంలో మునిగి ఏదో ఆలోచనలోవున్న అప్పిరెడ్డిని కూడా గమనించకుండా, అక్కడికి వెళ్లి కూర్చుండిపోయాడు రాజాలు. దాన్ని తుడుస్తూన్నంతసేపూ దృష్టంతా దానిమీదే వుంది. అప్పుడప్పుడూ చెరువులో పిట్టల్ని కొట్టుకురమ్మని తనచేతికి తుపాకిస్తే, ఆరోజు తను అన్నం తింటంకూడా మర్చిపోయేవాడు.

'తనకీ ఒక తుపాకివుంటే...! అమ్మో! అంత అదృష్టం తనకుండొద్దూ. మూడు నాలుగు సంవత్సరాల జీతం కూడబెడితేగాని రాదు...నిజంగా తనకే వుంటే పులినికొడితే భూమిఁ కరచుకుని కింద పడిపోదూ...? ఆకాశంలో ఎగిరేపిట్టలు తన్నుకుంటూవచ్చి తన కాళ్ల ముందు రాలిపడవూ...?' ఇంకా ఏదో ఊహిస్తూన్న రాజాలును సింహాద్రి ప్రశ్న యిటు త్రిప్పింది.

"ఈవాళ తప్పకుండా పులిపడతదంటవా రాజాలు? అంతా నీ చలవ. నువ్వు వెంటుంటే షికారుకాకుండా తిరిగి వచ్చిన రోజంటూ ఏమీలేదు—" అన్నాడు నవ్వుతూ. రాజాలు మనస్సు వికసించేలా నవ్వుకున్నాడు. ఆ పొగడ్తలో ఎంత ఆనందం వుందో వాడికే తెలియాలి.

"ఎందుకవద్దొర? మీరు తుపాకి పట్టుకుంటే ఏనుగైనా భూమి కొరుకుద్ది!"

సింహాద్రి నవ్వాడు. అర్థనిమీలిత నేత్రాలతో రాజాలుకేసి చూసి నవ్వాడు. ఆ నవ్వువేరు. ఆ నవ్వేతీరువేరు. దానిలో అతిక్రౌర్యం, కరుకుదనం, గంభీరత మిళితమై వుంటాయి. ఎరపెట్టి తింటూంటేను, అటూయిటూ అడివిలో పరుగులు పెటె గొంతుకెండుకు పోయి రాత్రులు ఏ తోపు దగరకో చల్లని నీళ్ళు త్రాగుదామని ఆశతో వచ్చే దుప్పుల్ని ఏ పొదచాటునో నక్కి, నిర్దాక్షిణ్యంగా ఒక్క దెబ్బతో పడగొట్టే నేర్పు వుండటం వల్లేమో, ఆ పేరుకున్న పాపం అంతా సింహాద్రికళ్లల్లో కనిపిస్తూంటుంది; సన్నటి మెలితిరిగిన కోరమీసాల మీద తాండవం చేస్తూంటుంది. 'ప్రాణాలు తియ్యడం ఏమంత కష్టమైన పనుల్లో లెక్కకాదు —' అనుకునే తరహా మనిషి సింహాద్రి.

చెల్లెలు కొడుకని, వ్యవసాయంలో సహాయం కోసమని సింహాద్రిని యింటిమీద పెట్టుకున్నాడు అప్పిరెడ్డి. తనతోపాటుగా నమ్మకమైన మిత్రుడు సుబ్బరాజును తోడు తెచ్చుకున్నాడు సింహాద్రి. వాళ్ళ జీవితంలో ఎక్కువ భాగం భవంతుల మధ్య, రంగు రంగుల మనుష్యుల మధ్య, రైలుకూతలు కారుహారన్సు రొదలలో గడపడం వల్ల యింకా యిక్కడి వాతావరణానికి సరిగా అలవాటు పడలేదు. అక్కడ వుండే మనుష్యులు—జంతువులు ఒక్కటే అనుకుంటాడు సింహాద్రి.

తుపాకి గొట్టం శుభ్రపరచిన తరువాత 'మాను'కి తగిలించి, కవరు తొడిగి, సుబ్బరాజుకిస్తే, గదిలో పెట్టి వచ్చాడు.

రాజాలు లేచి, ఎడ్లను విప్పుకు రావడానికి దొడ్లోకి బయలుదేరాడు.

"అంతంత ప్రొద్దుకి బండీ అదీ తయారుగా వుంచు...ప్రొద్దుకూకక ముందే బయలుదేరాలి...!" అన్నాడు సింహాద్రి. "సరే" అంటూ దొడ్లోకి వెళ్ళి ఎడ్లను విప్పుకు, చెరువుకి బయలుదేరాడు రాజాలు.

ప్రొద్దు, 'రెండు బారలు'పైగా ఎక్కినా యింకా చలిగాలి కొడుతూనే వుంది. దూరంగా కొండలను అంటిపెట్టుకుని వున్న నీలి పొగమంచు యింకా సరీగా చెదరిపోలేదు. దారి పొడుగూతా చెట్లఆకుల సందులకి పెట్టిన సాలెగూళ్ళ మీద వున్న మంచు బిందువులు ముత్యాలసరాల్లా మెరుస్తూన్నాయి ఎండలో.

ఎడ్లను రేవుకి దూరంగా తీసుకుపోయి, కడిగి, తను స్నానం చేసి యింటికి తోలుకొస్తూంటే, రేవులో నాగులు, కడవతో నీళ్ళు ముంచుతోంది

పరధ్యానంగా. ఎద్దుల్ని అక్కడ గట్టుమీద వదలి రేవులోకి వెళ్ళాడు రాజాలు.

"నీడ చూసుకొని మురిసిపోతున్నావా!"

నాగులు ఉలిక్కిపడి, రాజాలును చూచి కోలుకుంది.

"మరె-!" ముక్తసరిగా అని, నవ్వింది నాగులు.

కడవతో నీళ్లు ముంచి నెత్తికెత్తుకుంది. నీళ్లు తొణికి, ముఖంమ్మీదకు కారుతోంటే, ముఖం చిట్లించింది. నీరెండలో ఆ ముఖం చిట్లింపులో వుండే సోయగాన్ని కన్నార్పకుండా వెర్రిగా చూస్తూండిపోయాడు రాజాలు. ముక్కు పుడకలోని తెల్లరాయి 'తళక్' మంది.

"ఓస్—దీనందం! యింతందంగా వుందే యిది...!" అనుకున్నాడు రాజాలు.

"అట్టా చూస్తా వెందుకు...?" నాగులు సిగ్గుపడిపోయింది. కళ్ళలోకి సూటిగా చూడలేకపోయింది.

"రాత్రి అక్కడకు రాలేదనేమో" అనుకుంది నాగులు.

"రాత్రి అక్కడకు రాలే దెందుకో!" అనుకున్నాడు రాజాలు.

"రాత్రంతా నువ్వే కలలో వున్నావు" నవ్వాడు రాజాలు.

నాగులు నవ్వింది. చెక్కిలి కందిపోయేలా నవ్వుకుంది. ఏమీ మాట్లాడలేదు. కుండ అంచుమీద చెయ్యివేసి వయ్యారంగా నడుస్తోంటే, వెనుకే రాజాలు ఎద్దుల్ని తోలుకుని వస్తూన్నాడు.

"యివ్వాళ అంతబాగా మాట్లాడటంలేదే?" అనుకున్నాడు.

"వాగుదగ్గర తెల్లవారుఝాము దాకా కూర్చున్నాను. నువ్వు రాలేదే?" నాగులు రెండుమూడుఅడుగులువేసి అంది; యిటు చూడకుండానే!

"యికనుంచి అట్టా రావడానికి వీలుండదు!"

రాజాలు ఉలిక్కిపడ్డాడు.

"ఏం?"

"బాబాయికి తెలిసిపోయింది మనసంగతి. రాత్రి వస్తుంటే దారిలో కలిసి ఇంటికి తీసుకొచ్చేశాడు."

రాజాలు గతుక్కుమన్నాడు. 'దొర' ఏమంటాడో...అనుకున్నాడు.

"ఏమన్నా తిట్టాడా దొర?"

"ఆ—! నీ పెళ్లి చేస్తాడంట...!" గిరుక్కున ముందుకు తిరిగి, రాజాలు కళ్లల్లోకి సూటిగా చూస్తూ అని, నవ్వి మళ్లీ వెనక్కి తిరిగి, చరచరా నడచి వెళ్లిపోయింది నాగులు, ఎదురుగావస్తున్న వ్యక్తిని గమనించి. రాజాలుకి సరిగా అర్థంకాలేదు. పరాగ్గా నడుస్తూ ముళ్ళపొదమీద కాలువేసి అక్కడే చతికిలపడి ముళ్ళు తీసుకుని ఎడ్లను తోలుకుని ఇంటికి బయలుదేరాడు.

పశ్చిమాంగన నొసట రక్తచందనం దిద్దుకుంది. చెరువుగట్టు ఎర్రబారింది. తూర్పుకొండమీద రంగు బట్టలు ఆరవేసినట్టుంది.

వేటకి అవసరమైన సరంజామాఅంతా బండిలో ఎక్కించారు. బండిచుట్టూ పిల్లలు, పెద్దలు పోగయి ఉత్సాహంగా చూస్తున్నారు. సింహాద్రి వేటకెళితే తప్పకుండా ఏదో ఒకటి పడుతుందని వాళ్ళ నమ్మకం. అందులో పులివేటంటే మరీ వెర్రిగా వుంటారు.

అప్పిరెడ్డికూడా బండితోపాటుగా కొంతదూరం వరకూవచ్చి, వాళ్ళకు జాగ్రత్తంటూ హెచ్చరించి యింటికి తిరిగి వెళ్ళిపోయాడు. అప్పిరెడ్డికి వేటంటే అంత యిష్టముండదు. తనజీవితంలో ఎప్పుడూ ఏప్రాణిని 'హింస' పెట్టకూడదనుకుంటాడు. తన హృదయం ఎప్పుడు అతిసున్నితంగా, పూరేకుల్లా స్వచ్ఛంగా వుంచుకుంటానికి ప్రయత్నిస్తాడు. అది తన మతం.

ఇంతకీ వేటకెళ్లేదల్లా ముగ్గురే. సింహాద్రి, సుబ్బరాజు బండిలో పరుపువేయించుకొని సుఖంగా ఆసీనులయ్యారు. ముందు తొట్టిలో కూర్చుని బండి తోలుతున్నాడు రాజాలు. తిరనాళ్లలో కొన్న ఎర్రపంచె, గీతలు చొక్కా వేశాడు—పాతదయిందని పెదదొర యిచ్చిన సిల్కు కండువా తలకు చుట్టాడు. తీర్థానికి పోతున్నవాడిలా మరీ ఉత్సాహంగా వున్నాడా రోజు.

ఊరి పొలిమేర దాటగానే, జొన్నచొప్ప ఎత్తుకుని ఎదురుగా నాగులు వస్తూంటే బండివేగం కాస్త తగ్గించాడు రాజాలు. చెమటపట్టి వాడిపోయిన ముఖం నలిగిపోయిన మొదుగుపువ్వులా వుంది. తలలో వాడిపోయి, జారిపోతూన్న నీలి గోరింత చెండు భుజమ్మీద పడుతున్నది. నాగులు బండి దగ్గరకురాగానే, రాజాలు బండాపి మాట్లాడాలనుకున్నాడు. కాని బండిలో చిన్నదొరవాళ్లు ఉండడంవల్ల అది సాధ్యమయిందికాదు. కళ్లతోటే మాట్లాడి నవ్వాడు రాజాలు. బండి దూసుకొనిపోతూంటే తెల్లపోతూ అక్కడే నిలబడి బండికేసి చూస్తూండిపోయింది నాగులు.

బండిలో సింహాద్రి నవ్వుకున్నాడు. నాగులు కళ్లల్లో కళ్లుపెట్టి చూచాడు. నిర్లక్ష్యంగా చూచింది నాగులు. ఆ చూపులతోటే అందాన్నంతా త్రాగి వేస్తూన్నట్లు చూచాడు...అదేమీ సింహాద్రికి కొత్త కాదు...చిటారుకొమ్మల్లో పెట్టిన తేనెపట్టును చూస్తూ చెట్టుకింద కూర్చుని నీళ్లుకార్చడం కొత్తేమీ కాదు సింహాద్రికి—

"కొమ్మలొచ్చిన పెద్దపులులే నేల కరచుకొని నా కాళ్లముందు పడతాయి...నీ లెఖ్ఖెంత...?" అన్నట్టుచూచి, మెలితిరిగిన సన్నటి మీసంమీద చెయ్యివేసి కనుగిలిపి నవ్వాడు సింహాద్రి. నాగులువళ్లు ఝల్లుమంది...చెడ్డ అసహ్యం పుట్టుకొచ్చింది."యింకా సిగ్గు రాలేదేం—ఛీ...!" అనుకుని వెంటనే గిరుక్కున వెనక్కి తిరిగి, యింటిదారి పట్టింది నాగులు.

సుబ్బరాజుకి సైగచేస్తూ అట్టహాసంగా నవ్వాడు సింహాద్రి. ఇదేమీ పట్టించుకోకుండా బండి తోలుకు పోతున్నాడు రాజాలు.

* * * *

రాత్రి పన్నెండు దాటింది.

నిశీథంలో అడవంతా కీరుమనే ధ్వనిలో మునిగి అతి గంభీరంగా వుంది. అప్పుడప్పుడే చెట్ల సందుల్లోనుంచి చంద్రుడు పొడుచుకువస్తూన్నాడు. చెట్టు ఆకుసందుల్లోనుంచి "మాటు"లోకి వెన్నెలజాడ జాడలుగా పడుతోంది.

మాటులోనుంచి మూడుజతలకళ్లు అతి చురుగ్గా సమయంకోసం ఎదురు చూస్తున్నాయి. మాటుకి సమీపంలో, 'ఎర'గా రాటకుకట్టిన మేకపిల్ల నిర్విచారంగా ముందు వేసినగడ్డి మేస్తూంది.

సింహాద్రి తలకు తగిలించిన 'హెడ్ లైటు' తీసి ప్రక్కన పెట్టాడు; బరువుగావుందంటూ. డబుల్ బారల్ తుపాకి లోడ్ చేసివుంది. సుబ్బరాజు అప్పుడే కునికిపాట్లు మొదలు పెట్టాడు. ఏ పొద కదిలినా రాజాలు కళ్లుమాత్రంఅతి చురుగ్గా అటు తిరుగుతున్నాయి.

సింహాద్రి దృష్టి మాత్రం మరో దిక్కు వెతుక్కుంటూ పోతోంది. కళ్ళముందు ఏవోవో దృశ్యాలు సుడితిరిగి పొగమంచు తెరల్లా, క్రమ్ముకునే కారు మేఘాలలా కనిపించి మాయమవుతూన్నాయి. నిగ్గుదేరిన యౌవనం, పసిడిపువ్వుల సోయగం తన దృష్టిముందు... తను సృష్టించిన జ్వాలల్లో పడి దగ్ధమైపోతూన్నట్లు వుంది. ఎన్నో అందమైన లేళ్లు, జింకలు చెంగుచెంగున దుముకుతూ ఆవిషజ్వాలల్లో పడి, మంటలో కురికిన మిడతలదండులా మాడి, ఆహుతి అవుతున్నట్లు కనిపిస్తూంది.

"అందులోనే......ఆమందలోనే ఒక లేడిపిల్ల—చెంగు చెంగున వయ్యారంగా, అతి స్వేచ్ఛగా పరుగులు పెట్టే అందమైన లేడిపిల్ల—అదే తనకు కావాలి...అదే తను పన్నిన ఉచ్చులో పడాలి...ఎన్నోసార్లు పట్టుకుంటానికి దగ్గరగా వెళ్లేవాడు. రకరకాల విషజ్వాలల్ని పుట్టించి మీదకు వదిలేవాడు...ఏం జరగేది? వెనుక కాళ్లతో ఎదురొమ్ము పగిలేలా తన్ని పారిపోయేది...! ఎక్కడికి—ఎక్కడికి పోయేది...? నవనవలాడే గడ్డి మైదానాల్లోకి, ఘుమఘుమలాడే పూల వనాల్లోకి, చల్లచల్లని సెలవిళ్ల చెంతకు. ఏపుంతలోనో తన 'ప్రియుడి' తో స్వేచ్ఛావిహారం చేస్తూ హాయిగా వుండేది...! అది చూస్తున్నంతసేపు తన హృదయం వెయ్యిక్కళ్లు చేసుకు చూచేది...ఆచూపులోనుంచి ఏదో బడబాగ్ని లాంటిది పుట్టేది. ఆ జ్వాలల్లో పడి తన హృదయం ఎప్పుడూ కాలిపోతూంటుంది...ఎప్పుడూ ఉడికి పోతూంటుంది—ఎట్లా చల్లారుతుం దిది? తను నిజంగా తలుచుకుంటే ఎంత...? ఆలేడి పిల్ల ఎంత? ఒక్క దెబ్బకు తన ఒడిలోవచ్చి పడదూ..."

సింహాద్రి ఊహలు కట్టలు, గట్లు తెంచుకుని ఎక్కడెక్కడికో పోతూన్నాయి. పులి జాడ మాత్రం యింకా లేదు. సింహాద్రి వాచీ వాచూచుకున్నాడు. రెండుగంటలు దాటింది. సుబ్బరాజు నిద్రకాగలేక, మాటులోనే తలక్రింద దిండు పెట్టుకుని నడుంవాల్చాడు. పొదల్లోనుంచి కీచురాళ్ల ధ్వని తప్ప అడవంతా నిశ్శబ్దంగా వుంది. చలిమాత్రం ఎముకలుకొరికి వేస్తూంది. చెట్ల నీడల్లోనుంచి మిణుగురుపురుగులు మెరుస్తూ ఆశాజ్యోతుల్లా పోతున్నాయి. మాటు క్రింద కట్టిన మేకపిల్ల కడుపులో తల యిరికించుకుని స్వేచ్ఛగా నిద్రపోతోంది.

సింహాద్రి మళ్లీ దీర్ఘాలోచనలో పడ్డాడు. రాజాలు కళ్లుమాత్రం మరుగ్గా పొదల్ని గాలిస్తున్నాయి. ఉన్నట్టుండి మాటులోనుంచి ఏదో జారి క్రిందపడ్డట్టు శబ్దమయింది.రాజాలు ఉలిక్కిపడ్డాడు. సింహాద్రి ఉలిక్కి పడ్డట్టే పడ్డాడు.

"లైటు పడ్డట్టుంది దొరా క్రింద...! మీ చెయ్యి తగిలిందా!"

"ఊఁ..! ఎట్లా యిప్పుడు?" అన్నాడు సింహాద్రి కిందపడ్డ లైటు కేసి చూస్తూ.

"దిగి తేనా ?" అన్నాడు రాజాలు చెట్టుదిగటానికి సర్దుకుంటూ. ఈ మాట అనగానే సింహాద్రికి ఎందుకో ఒళ్లు ఝల్లుమంది. గుండె వేగంగా కొట్టుకుంది.

"పులొస్తే ?"

"యింతలోనే ఎక్కడొస్తుంది దొరా...అంతసేపటినుంచి లేంది-వచ్చినా తుపాకిబారు చేసివుందిగా...ఏం భయం ?" అంటూనే నెమ్మదిగా చెట్టు దిగాడు రాజాలు. ఈ గొడవేమీ తెలియకుండానే మత్తుగా నిద్రపోతూన్నాడు సుబ్బరాజు.

రాజాలు చెట్టుదిగి, క్రిందపడ్డ లైటును సమీపించి వంగి, నేలమీద లైటును తియ్యబోయాడు. అంతలోనే, మాటులోనుంచి, నిశ్శబ్దాన్ని చీలుస్తూ, అడవంతా మార్మ్రోగేలా 'ఢన్ ... ఢన్!...'మని రెండుసార్లు తుపాకి పేలింది! మాటులో నిద్రపోయే సుబ్బరాజు త్రుళ్లిపడి లేచాడు. మాటుక్రింద కట్టిన మేకపిల్లకు కంగారుపుట్టి తాడు తెంచుకు ఎటో పారిపోయింది.

మాటుక్రింద రాజాలు గుండె చేత్తో పట్టుకుని, ముద్దలా ముట్టుకుని అక్కడే నేల కొరిగిపోయాడు...!! మైమరచి నిద్రించే భూదేవి వెన్ను 'కలుక్కు' మంది. ...... పీడకలలో, అక్కడ నాగులు గుండెల్లో ఎవరో బలంగా కత్తి గుచ్చినట్లై, వెర్రి కేకపెట్టి లేచి కూర్చుండిపోయింది !

అతి భయంకరమైన వాతావరణం త్రుటికాలం మెరపులా మెరసి, మళ్లీ అడవిలో నిశ్శబ్దం ఆవరించుకుపోయింది. త్రుళ్లిపడి లేచిన సుబ్బరాజు, భుజానికి ఆన్చిన తుపాకినిదించే సింహాద్రిని చూచి తెల్లబోయాడు.

"ఏంజరిగింది సింహాద్రి! పులిగాని వచ్చిందా..?"

సింహాద్రి మాట్లాడలేదు. అతని ముఖమ్మీద తాండవం చేసే అమానుషత్వం, అతి క్రౌర్యం మాటులో, చెట్లగుబుర్లలో, అలుముకుపోయిన ఆ మసక చీకట్లో అతిస్పష్టంగా, భయంకరంగా కనిపిస్తూంది.

సుబ్బరాజు కొన్ని క్షణాలకు అక్కడ జరిగిన అమానుషాన్ని గ్రహించాడు. మాటుక్రింద భూదేవి ఒడిలో శాశ్వతంగా కన్నుమూసి, ప్రక్కకు ఒరిగిపడివున్న రాజాలును చూచి స్తబ్ధుడయ్యాడు. ఆ దృశ్యం చూడగానే ఆ పాద మస్తకం వణికిపోయాడు సుబ్బరాజు.

"ఏమిటిది..? యిది ఎలా జరిగింది సింహాద్రీ..?"

సింహాద్రి కొన్ని క్షణాలవరకూ మాట్లాడలేదు. దొంగతనం చేసి పట్టుపడ్డ వాడిలా గుండెలు అతివేగంగా కొట్టుకోడం మొదలు పెట్టాయి. హృదయంలో ఒకప్రక్కనుంచి చెప్పరాని భయం బల్లెంతో పొడుస్తున్నట్టు బాధ పడుతూన్నాడు. అయినా నెత్తిమీదనుంచి ఏదో పెద్ద బరువు దించినట్టు తేలిగ్గా నిట్టూర్పు వదిలాడు.

"ఏమీలేదు. లైటుజారి క్రిందపడితే, తేవడానికని చెట్టుదిగాడు. అంతలోనే తుపాకు దానంతటదే పేలిపోయింది...!"

సుబ్బరాజు నమ్మలేకపోయాడు. ఏదో అనుమానం కలిగింది. ఇటువంటి అఘాయిత్యం ఎందుకు జరిగిందో ఊహించలేకపోయాడు, సింహాద్రిలో యిటువంటి అమానుషం, క్రౌర్యం వున్నాయని ఎప్పుడూ అనుకోలేదు. ఒక వ్యక్తిని నిలువునా కాల్చే సాహసం వుందని ఏనాడూ ఊహించలేదు. సుబ్బరాజుకి కర్తవ్యం ఏమిటో బోధపడలేదు. తర్కించి ఎదురు ప్రశ్నలు వెయ్య బుద్ధికాలేదు.

"మరి యిప్పుడెట్లా ? వూర్లో తెలిస్తే...!యింటి దగ్గర ఏమని చెప్పడం?" అన్నాడు సుబ్బరాజు.

"తెలియడం......!" గంభీరంగా నవ్వాడు సింహాద్రి. "యిక్కడ నువ్వు. నేనూ తప్ప యితర ప్రాణి లేదు. నామీద నీకు విశ్వాసం వున్నంతకాలం తెలియడమనేది అసంభవం...!"

సుబ్బరాజు కళ్లల్లోకి సూటిగా చూచి నవ్వాడు సింహాద్రి. ఆ చూపుల్లోని భావం ఆ మసకచీకట్లో అంత స్పష్టంకాలేదు సుబ్బరాజుకి.

సుబ్బరాజు ఏమీ మాట్లాడలేదు; హృదయంలో చెప్పరాని క్షోభ బయలుదేరింది. మౌనంగా తలవంచుకుని, మోకాళ్లమీద ఆన్చి, రెండు కన్నీటి బిందువులు రాల్చాడు సుబ్బరాజు. అవి సింహాద్రిలాంటి పాపపు కంటికి కనిపించవు. కనీసం అవి ఆతావులోకి రావడానికి సిగ్గుపడతాయి.

అప్పటికి తెల్లవారుజాము కావస్తూంది. దూరంగా అడవికోళ్లు కూస్తూన్నాయి. ఎక్కడో దూరంగా నక్కలు మోరచాచుకుని అరుస్తూన్నాయి. తెల్లగా ప్రకాశించే చంద్రుడు చెట్లగుబుర్లలోనుంచి, నేలమీద పడివున్న రాజాలు శవంమీద చల్లటి వెన్నెల కురిపిస్తూన్నాడు. ఆకాశంలో నుంచి తీతువపిట్ట అర్చుకుంటూ తూర్పు దిక్కుగా ప్రయాణమై ఎగిరిపోతోంది.

సింహాద్రి తుపాకి భుజానికి తగిలించుకుని మాటు దిగాడు. సుబ్బరాజు అతన్ని అనుసరించాడు. ఇక

సుబ్బరాజు కర్తవ్యమల్లా సింహాద్రి చెప్పినట్లల్లా నడచుకోవడమే...!

* * * *

తెల్లవారింది: గూడెం అంతా పొగమంచులో మునిగి మత్తుగా మేల్కొంది. రాత్రిమాటులో రాజాల్ని పులి మీదపడి లాక్కుపోయిందనే వార్త గూడెం అంతా మ్రోగిపోతున్న—!

ఊరు వూరు వచ్చి అప్పిరెడ్డి యింటిముందు మూగారు. నాగులు ఈ వార్తవిని, యింట్లోనుంచి బయటకు వస్తూ విరుచుకుపడి మూర్ఛపోయింది. ఆ మూర్ఛల్లా ఎంతోసేపటికిగాని తేరి, మాటా మంతీ లేకుండా వెర్రిచూపులో పడిపోయింది.

"దీనికి ఆ వార్త వినగానే మతి దెబ్బతిని వుంటుంది...!" అన్నారు.

అప్పిరెడ్డి పైపంచతో కళ్లద్దుకుంటూ గోడకు జేరబడి దీర్ఘాలోచనలో మునిగివున్నాడు. సింహాద్రి మాత్రం ఏదో కట్టుకథను గ్రామస్థులదగ్గర చెప్పుకు పోతుంటే అంతా వింటూన్నారు కళ్లప్పగించుకుని.— చిట్టచివరకు గ్రామస్థులు, అప్పిరెడ్డి వగైరాలంతా ఒక నిర్ణయానికివచ్చి రాజాలుశవం అన్నా దొరుకుతుందేమోననే ఆశతో అడవంతా గాలించడానికి బయలుదేరారు మిట్టమధ్యాన్నానికి.

"ఇదిగో...! యిక్కడే లైటు క్రిందపడ్డది... దిగొద్దంటుండగా చెట్టుదిగాడు దాన్ని తేవడానికి... అంతలోనే పులి వచ్చింది పొదలోనుంచి...లైటు అందుకుని గబగబా మళ్లీ చెట్టెక్కుతుండగా మీదబడి క్రింద పడగొట్టి లాక్కుపోయింది...! నేను రెండు దెబ్బలుకూడా వేశాను ...ఆయువుపట్టున తగల్లేదు ఆ కంగారులో ... మొత్తంమీద పులికి దెబ్బతగిలే వుంటుంది—!"

చెప్పుకు పోతూన్నాడు సింహాద్రి — అంతా నిట్టూరుస్తుంటే సుబ్బరాజు మాత్రం మౌనం దాల్చాడు. లోలోన ఏదో బాధ గుండెను పెనవేస్తుంటే పైకి కనబడనీయకుండా దాచుకుంటూన్నాడు.

ప్రొద్దు వాలేవరకూ వెదికారు—రాజాలు శవం ఎక్కడా కనిపించలేదు—అంతా నిరాశతో గూడానికి తిరిగి వచ్చేశారు. "ఇంతపనీ జరిగినతరువాత ఆపులిని ప్రాణాలతో వదలగూడ" దన్నారు గ్రామసులు. విధిలేక మళ్లీ ఆరాత్రే మాటుకట్టాల్సి వచ్చింది సింహాద్రి.

మళ్లీ అదేమాటు—అదేప్రదేశం నిర్దాక్షిణ్యంగా అతిక్రూరంగా బలిఅయిన ఒక అమాయకుడి వేడి రక్తంతో తడిసిన ఆమట్టిమీదే—అదే చెట్టుమీద మాటు. మాటులో సింహాద్రి సుబ్బరాజు కూర్చుని వున్నారు. క్రితంరాత్రి జరిగిన సంఘటనలు పదేపదే సింహాద్రి కళ్లముందు తిరుగుతూన్నాయి...ఎందుకో ఈరోజు మాట్లోవుంటే గుండెల్లో భయం భయంగా వుంది సింహాద్రికి. ఏవో దృశ్యాలు కళ్లముందు ఆడుతున్నాయి.

అడవంతా అంధకారంలో మునిగివుంది. ఇంకా అప్పటికి వెన్నెల రాలేదు. 'కేరు'మని ధ్వనించే ఆ అరణ్యంలో భయంకరమైన కటిక చీకటిలో ఏవో భయానక దృశ్యాలు కనిపిస్తూన్నాయి. అడవి దయ్యాలు తలలు విరబోసుకుని కోలాహలంగా సవ్వడి చేస్తూ ఘల్లుఘల్లుమని మాటుచుట్టూ నృత్యం చేస్తున్నట్లు కనిపిస్తున్నది సింహాద్రి కళ్లముందు.

మళ్లీ మాటులోకి ఎందుకువచ్చాడు తను—? తను వేసుకున్న పథకం గతరాత్రితో తీరిపోయింది... గ్రామస్థుల నమ్మకంకోసం వచ్చాడు. నిజంగా పులి వచ్చినారాకపోయినా తనకేమి అభ్యంతరం లేదు. ఎన్నడూ లేంది ఈనాడెందుకో గుండెల్లో భయం భయంగా వుంది—పీడకలలా వికృతదృశ్యాలు కనిపిస్తూ తన్ను భయపెడుతున్నాయి. తను గతరాత్రి పాపకార్యంచేశాడు. దానికి పరిహారంగా ఏనాగుబామో చెట్టుఎక్కి తన్ను కాటు వేస్తే...? రాజాలు దయ్యమయి తనపీకనులిపి చంపేస్తే...

సింహాద్రి ఊహలు మళ్లకట్టలు త్రెంచుకుని ఎటో పోతున్నాయి. అర్థంలేకుండా సన్నగిల్లి పోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని నిలుపుకుంటున్నాడు. సుబ్బరాజుమాత్రం విధిలేక కునికిపాట్లు పడుతూ మోకాళ్లల్లో తలదూర్చి పడుకుని వున్నాడు.

ఒంటరిగా అడవిలో నిశాచరుడిలా నిద్రరాక ఏవోగత స్మృతులు బాధిస్తోంటే అటాగే మేల్కొని యోచనలో పడిపోయాడు సింహాద్రి.

క్రితంరాత్రి ఒక వ్యక్తిని నిలువునా ప్రాణాలు తీశాడు—ప్రాణాలు తియ్యడం తనకు కొత్తకాదు—ఏమంత కష్టమైందీ కాదు — తుపాకీ 'కమాన్' నొక్కితే చాలు...తను అమితంగా వాంఛించే దానికోసం తను ఏపని అయినా చెయ్యడానికి వెనుదియ్యడు,

ముఖ్యంగా ఒకనాడు తనలో రేగిన ప్రతీకారం, కక్ష, ఇప్పటికి తీరాయి. నాగులు...నాగులు తనకు దక్కక పోయినా...వాడికోసం తపించి తపించి చావాలి...! అప్పుడు తన హృదయం తేలి కవ్వాలి...! అదే తను వాంఛించేది.

అప్పటికి అర్ధరాత్రయింది. గుట్టచాటును తప్పించుకుని వచ్చి, ఎండిపోయిన మోదుగ చెట్టుగుబురులో నుంచి కనిపించే చంద్రుడు మెరికి మెరికిగా, కాంతి విహీనంగా వెలుగుతూన్నాడు. ఆ గ్రుడ్డివెలుగులో సమీపంలోవున్న గుట్ట, పెద్దరాక్షసుడు అడ్డంగా పడుకుని నిద్రపోతూన్నట్టు కనిపిస్తూంది. గుబురుగావున్న చెట్లు తలలు విరబోసుకున్న అడవి దయ్యాల్లా కనిపిస్తూన్నాయి. అంతలోనే దూరంగా యెక్కడనుంచో, "రాజాలూ...!" అన్న కేక వినిపించింది. ఆ కేకతో అడవంతా మారుమ్రోగింది. అదేపిలుపు ఎన్నోసార్లు దిక్కు దిక్కులుగా ప్రతిధ్వనించింది.

మాటులో కూర్చుని ఆలోచించే సింహాద్రి త్రుళ్ళి పడ్డాడు. ఒక్కసారిగా గుండెలు ఝల్లుమన్నాయి. శరీరం అంతా పొగ గ్రమ్మింది.

"—సుబ్బరాజు!"

నిద్రపోయే సుబ్బరాజును తట్టిలేపాడు సింహాద్రి. సుబ్బరాజు ఉలిక్కిపడి లేచాడు.

"చూడు—అటు విను ఆ కేక ఏమి టంటావు?"

ఆ కేక మళ్ళీ వినిపించింది. అది దగ్గరగా వస్తున్నట్టుంది!"...

సుబ్బరాజు గ్రహించాడు.

"పాపం...! నాగులు అనుకుంటా...! దానికి మతి చలించింది...వాడు పోవడంతోటే! మనస్సు వుండబట్టలేక ఇటు వచ్చివుంటుంది...!"

నిట్టూర్పు వదలాడు సుబ్బరాజు.

"మధ్యాన్నం చెరువులో పడబోతే తీసుకొచ్చారు కదూ?"

సింహాద్రి ప్రశ్నకు సుబ్బరాజు ఏమీ సమాధానం ఇవ్వలేదు. కనుకొలుకుల్లోకి వచ్చిన నీళ్ళను అద్దుకున్నాడు.

ఆ పిలుపు మరీ దగ్గరకు వస్తున్నట్టు వుంది. పరుగెత్తుతూన్నప్పుడు కాలి అందెల సవ్వడి స్పష్టంగా వినిపిస్తూంది. సింహాద్రి క్షణం యోచించాడు. అతనిలో ఏమూలో అణగి మణగి దాగివున్న వాంఛ లేవో ఒక్కసారిగా విజృంభించాయి!...

"దిగి చూచి వస్తా!..." అన్నాడు సింహాద్రి.

సుబ్బరాజు తెల్లబోయాడు.

"ఎందుకూ?—"

"ఏమీలేదు. ఇంత అడవిలో ఒంటరిగా వచ్చింది పాపం...ఏమన్నా అయితే. సుబ్బరాజు వెంటనే సింహాద్రి ఉద్దేశ్యాన్ని కనిపెట్టి అసహ్యించుకున్నాడు.

"దిగితే ప్రమాదం! ఒకవేళ పులి వస్తే...?"

సింహాద్రి నవ్వాడు.

"పులి!—తుపాకీ వుందిగా...తీస్కెళతాను-!"

సుబ్బరాజు వారిస్తున్నా వినక, తుపాకీ భుజాన్నపెట్టుకుని చెట్టు దిగాడు సింహాద్రి.

మాటులో సుబ్బరాజు స్తబ్ధుడై వుండిపోయాడు తను మళ్లీ తిరిగివచ్చేవరకు మాటులోనే కూర్చోమని చెప్పి పిలుపు వినవచ్చేవైపుకు నడచాడు సింహాద్రి. ఆ పిలుపుతో నిశ్శబ్దంగావున్న అడవంతా మ్రోగుతోంది. అటు యిటు రుగురగ త్తినప్పుడు కాలి అందెల మోతతోపాటు, కాలిక్రింద సలిగే ఎండుటాకులు గలగలా చప్పుడు చేస్తూన్నాయి. ఆ పిలుపువచ్చే దిక్కుగా వెళ్లాడు సింహాద్రి—అనతిదూరంలో ఒక ఆకారం తల విరబోసుకుని, 'రాజాలూ...' అని కేక వేసుకుంటూ పిచ్చిగా అటువైపుకి పరుగెత్తుతూన్నట్టు కనిపించింది సింహాద్రి అటువైపుకి వెళ్లి గట్టిగా పిలిచాడు. "నాగులు—!"

పరుగెత్తే నాగులు ఈ కేక వినిపించగానే త్రుళ్లిపడ్డట్టు ఆగిపోయింది.

"ఆగు...ఎక్కడికి...! యింత అడవిలో ఎందుకొచ్చావు?—"

సింహాద్రి పరుగెత్తుకుంటూ వెళ్లి అక్కడ ఆగాడు.

ఆ మసక వెన్నెల్లో, తల విరబోసుకుని శోకించే వనదేవతలా నిలబడివుంది నాగులు - మిస మిసలాడే పాలపొంగులాంటి యౌవనం పైకి చిమ్ముతోంది- ఇక్కడ ఈ సమయంలో ఒంటరిగా తనకి చిక్కడం అదృష్టమనుకున్నాడు- బాటవెంట పోతుంటే అనుకోకుండా తనమీద పూలవాన కురిసినట్లైంది సింహాద్రికి.

నాగులు సింహాద్రి కళ్ళల్లోకి పరికించిచూచి, పులిని చూచిన లేడిపిల్లలా చెంగునదూకి తప్పుకు పారిపోబోయింది. సింహాద్రి వెంటపడి నాగులు చెయ్యి బలంగా పట్టుకున్నాడు. బలంగా కొరికి పరుగు పెట్టింది నాలుగు. సింహాద్రి తరుముతూ వెంటపడ్డాడు.

పొదల్లో, చెట్లనీడల్లో నుం,చి ఎండుటాకులమీద నుంచి, ఎటో ఎటో పరుగెత్తుతోంది నాగులు...... సింహాద్రి తరుముకుపోతున్నాడు వగురుస్తూ...

అనతిదూరంలో మసకమసకగా పెద్దవాగు కనిపిస్తూంది....ఎదురుగా నాగులు ఆవైపుకే పరుగెత్తుతోంది...అది సుమారు ఇరవై గజాలు లోతువున్న పెద్ద అఖాతం...కారుచీకట్లు క్రమ్మిన పెద్దలోయ...... కాలువేస్తే జారిపోయే గరిగోడ. నాగులు అటువైపుకే పరుగెత్తుకుపోతుంటే సింహాద్రికి ఆతురత ఎక్కువైంది...అక్కడే...ఆలోయలోనే రాత్రి, రాజాలు శివాన్ని పూడ్చిపెట్టారు - నాగులు యింకా పరుగెత్తుతూనే వుంది. ఎదురుగా అఖాతం వుందని తెలీకా? తెలిసే పోతుందా? అనిపించింది పింహాద్రికి. సింహాద్రి తొందరగా పరుగెత్తాడు.

"నాగులు! ఆగు—నీకేం భయంలేదు!..." దగ్గరగా పరుగెత్తి పట్టుకోబోయాడు.

అయితే క్షణంలో నాగులు అదృశ్యమయింది...! భూమిని బ్రద్దలుకొట్టుకుని పాతాళంలోకి పోయే వనదేవతలా నాగులు ఆ లోయలోపడి అదృశ్యమైపోయింది...!

క్షణంసేపు అడవంతా నిశ్శబ్దం అయింది...! రెక్కలు దులుపుతూ గుడ్లగూబ కూసుకుంటూ మరో దిక్కుగా ఎగిరిపోయింది.

సింహాద్రి ఆయాసపడుతూ, ఆ వాగు గట్టుమీద నిలబడి లోపలికి, లోయలోకి తొంగి చూచాడు స్థబుడై.

ఏముంది—?

అంధకారం! లోయంతా అంధకారం-రాళ్ళమీదనుంచి పాకే నీరు గలగలా శప్పుడు చేస్తూంది... లోనుంచి అడవిపూల వాసన ఘుప్పున కొట్టింది! వాగునిస్పృహతో సింహాద్రి వెనక్కు తిరిగాడు. అంతే — స్తబుడై నిలబడిపోయాడు మళ్లీ...!

గలగల కదిలే పొదలో, మిలమిల మెరిసే రెండు ఎర్రటి జ్యోతులు కనిపించాయి! ఎండుటాకులమీద, బలమైన అడుగుల సవ్వడి వినిపించింది. గచ్చపొదలో నుంచి పులి దూసుకొచ్చి సింహాద్రి ఎదురుగా నిలబడింది...!! సింహాద్రి కళ్లు చీకట్లు క్రమ్మాయి...! ఎక్కడేముందో కనిపించడంలేదు. నాలుక ఎండుకుపోతున్నట్లు వుంది. భుజంమీమ్మద వున్న తుపాకిని మెల్లగా చేతితోపట్టుకుని లేపాడు.

'మృత్యువు' తో కను భూమికి తాటించి కొడుతూ. ఒళ్లు జళిపించి, 'గ్రు'మంటూ సింహాద్రి మీదకు దూకింది. కాళ్ల తాకిడికి రేగిన ఎండుటాకులు చెల్లా చెదురుగా ఎగిరిపోయాయి.

క్షణంలో సింహాద్రి వెర్రికేకపెట్టి నేలకొరిగిపోయాడు—! చేతిలోని తుపాకి మిట్టిపడి అనతి దూరంలో పడ్డది. బలమైన పంజా దెబ్బతో ఎదురొమ్ముపగిలి వేడిరక్తం బయటకు చిమ్మింది.

త్రుటికాలంలో అడవిలో మళ్లీ నిశ్శబ్దత ఆవరించింది. అడవంతా శోకించే వనదేవత కౌగిల్లో యిరికి ఆ మసక వెన్నెల్లో మత్తుగా నిద్రపోతూంది. పొదల్లో, ఎండుటాకులమీద మాత్రం ఏదో ఈడ్చుకుపోతున్నట్టు 'బరబర' మని శబ్దమవుతూంది.

అక్కడ, గూడెంలో తనయింట్లో కిటికీకి ఎదురుగా, కలత నిదురపోతూన్న అప్పిరెడ్డికి, పీడ కలలో పేగు పెనవేసుకుని త్రుళ్లిపడి లేచాడు. భూదేవి కౌగిలివీడి, ఏవో రెండు దివ్యజ్యోతులు ఆకాశంలోకి ఎక్కుతూన్నట్టు కిటికీలోనుంచి కనిపించింది అప్పిరెడ్డికి !